# దత్తపుత్రుడు

అయిదేళ్ళ వాడప్పుడు ప్రసాదరావును తెచ్చి పెంచుకున్నది సుబ్బమ్మ గారు. వాడికి లక్ష్మీనారాయణశాస్త్రి అని తన భర్తగారి పేరే పెట్టించుకుని, ఆ పేరు పెట్టి పిలిచే యోగ్యత తనకులేదు గనుక 'ప్రసాదం' అని పిలిచేది.

తన దత్తత నిశ్చయమైన కొత్తలో ప్రసాదం (లేక శాస్త్రి) తనకేదో జరగబోతున్నదని మాత్రమే తెలుసుకోగలిగాడుగాని, అది ఏమిటో గ్రహించ లేక పోయినాడు. తనకు నిజంగా ఏదైనా విపత్తే జరగబోతుంటే ఎవరో ఒకరు తనకోసం ఆదుర్దాపడరా? ఏ విపత్తూ లేకపోతే, తన తల్లి మొహం ముడుచుకొని సహం కావటానికి కారణం ఏమిటి?....ఆ రాత్రి ఒక రాత్రివేళ ఆవిడ తన పక్కలో వచ్చి ఎందుకు పడుకున్నది ? తన మొహం ఎందుకు అన్నిసార్లు ముద్దు పెట్టు కొన్నది? ఆవిడ మొహం తన మొహానికి తడిగా ఎందుకు తగిలింది.

తన తల్లి చేసిన ఆ పనికి ఆ అర్భకుడికి ఆనందం కలిగే అవకాశంకూడా ఎక్కడ? ఒక వేపునించి అర్థంకాని భయం అవతరించుకొచ్చిందేగాని!

ఆ తరువాత, వెంటనే కొద్ది రోజుల్లో దత్తత చేసేశారు. తనకు కొత్త తల్లి వచ్చింది. ఆవిడకు జుట్టులేదు. బొట్టులేదు. ఇకముందు ఆవిడ తనకు అమ్మ ! వెధవముండ అయిన అమ్మను ప్రసాదం ఊహించుకోలేకపోయినాడు. వాడి కది చెప్పరానంత అశుభంగా తోచింది.

దత్తత జరుగుతుంటే వాడు ఎవరికేసీ చూడలేకపోయినాడు. అవ మానమూ, రోషమూ, దుఃఖమూ, నిరాశా, ఇంకేమేమిటో వాడి చిన్నహృదయాన్ని మథించేస్తున్నై, వాడి కళ్ళు మంత్రాలు చదివే బ్రాహ్మణిగురించి ఆత్రంగా అనవ సరమైన వివరాలన్నీ గమనిస్తున్నై. ఆయన పెదిమలు ఎట్లా కదిలేది, ఆయన మెడమీది చర్మమూ పీకా ఎట్లా పైకి కిందికీ ఆడుతున్నదీ, మంత్రాలు చదవటంలో గుక్కతీసుకునేటప్పుడు ఆయన కనుబొమ్మలు ఏవిధంగా పైకెత్తేది గమనిస్తు న్నాడు. తన వెనక, సమీపంలోనే కూర్చున్న తన అమ్మ- ఆ వెధవముండ గుండు ముసుగుకాదు!- 'అమ్మ మొహం ఎట్లావున్నదీ, చూడకుండానే వాడికి కని పిస్తున్నది.

దత్తత అయిపోగానే 'అమ్మ' కంటనీరు పెట్టుకున్నది. తనక్కూడా బావురు మని ఏడుపొచ్చింది. ప్రసాదం ఏడిచాడు.

"పిల్లవాణ్ని కాస్సేపు అట్లా దొడ్లోకి తీసుకుపోయి సముదాయించ

వమ్మా!" అని ఒకమగగొంతు – నలభై ఏళ్ళ నెరసినగడ్డం గొంతు — కేక పెట్టింది.

"నాన్నగారూ? ఏడవకు అట్లా ఏడుస్తారా ఎక్కడన్నా?" అన్నది అమ్మ.

"మరి నువ్వేడవలేదు టే?" అన్నాడు ప్రసాదం.

"మిగిలిన నలుగురు పిల్లలులేందీ. నువ్వు నన్ను 'ఏమే' అని పిలవటం కూడా ఎందుకు నేర్చుకున్నావురా నానా? నీ మాటలు జ్ఞాపకం వస్తే నేనేమయే దిరా?" అని ఆవిడ మళ్ళీ రోదనం మొదలుపెట్టింది. ప్రసాదానికి ఏడుపొచ్చింది.

ఇంతలో ముందుకు పోయినట్లుగా వచ్చింది ఆ ముసుగు గుండు వెధవ ముండ- "పిల్లవాడేస్తున్నాడటమ్మా? పాపం...."అంటూ.

దూరాన్నించి ఒకగర్జన వినబడింది—" వొసే, నుబ్బ .... మ్మా" గడ్డం నెరిసిన నలభై ఏళ్ళ గొంతు.

"ఓ ఓ ఓయ్!" అన్నది ముసుగు వెధవముండ గుండు.

"న్ వ్ ట్ రా?"— నెరసిన పీఘాది నలభై ఏళ్ళ రుద్రాక్షలు, బలవం తాన గుండు రుద్రాక్షమాల మాట ప్రకారం నడుచుకుంటూ వెళ్ళింది.

"అమ్మా, నాకు వాళ్ళ ఆస్తి ఒద్దే!" అన్నాడు ప్రసాదం ఏడుపు గొంతులో. తల్లి సమాధానంకోసం ఊపిరి బిగబట్టి చెవులు రిక్కించిన దేవతల కేమీ వినిపించలేదు.

* * * *

"అబ్బాయి, ప్రసాదం!.... ఇక్కడవుండే పలకవేంరా నాయనా?"

"ఎందుకేం?"

"అన్నం తినవుట్రా?"

"నా కాకల్లేదు ఫో!"

"నువు మా అమ్మ నేడిపించలేదేం? ఆవిడకన్న నువెక్కువేడుస్తున్నావా?"

"హయ్యో తండ్రీ! ఏడవదూ, పాపం ! కన్నకడుపు కాదూ? నిన్నెప్పుడు పెంపుడివ్వటానికి వొప్పుకుందో అప్పుడే ఆవిడ కడుపు కోసుకుంది."

"నువు పెంపుడడిగితే ఇచ్చింది. లేకపోతే ఇస్తుందా ఏమిటి?"

"అడిగితే మాత్రం ఇస్తారుట్రా నాయనా! ఇంకా ఇద్దరు కొడుకులూ, ఓ కూతురూ ఉన్నారు గనక ఇచ్చింది లేకపోతే ఇస్తుందా?"

"మరి నా కోసం ఏడవటం మానేసిందా?"

"మానకుండా వుంధా ఏమిటి? ఏడిచి ఏడిచి మానేసుంటుంది."

"మా అమ్మ నా కోసం రోజూ ఏడుస్తుంది."

"నేను మాత్రం మీ అమ్మను కాదుట్రా నాయనా!

"నువు మా అమ్మ వెందుకవుతావేమిటి? మాఅమ్మను నేను 'ఏమే' అనేవాణ్ని. అందుకని నా కోసం ఏడుస్తుంది."

"నన్ను కూడా 'ఏమే' అనరా!"

"మా అమ్మ నా దగ్గర పడుకుని ముద్దుపెట్టుకునేది."

"మరీ, నే ముద్దు పెట్టుకోబోతే తోసేస్తా వెందుకురా నాయనా?

"నువ్వా! నీ దగ్గర వెధవముండ వాసన! నువ్వేమన్నా మా అమ్మవా ఏమిటి, నన్ను ముద్దు పెట్టుకోటానికి!"

"నేను మీ అమ్మల్లే ఏడవటంలా? చూడూ!"

"అన్నీ దొంగ ఏడుపులు!.... నాతో అవీ ఇవీ చెప్పుతూ కూర్చుని అన్నం పెట్టవేం?"

"ఇదిగో ఒక్క క్షణం!"

"నాకు పెరుగ్గావాలి, ఉందా?"

"అయ్యో నీకు పెరుగు లేకుండా చేస్తానుట్రా?"

"నిన్ను 'అమ్మా' అని పిలవటానికి లంచమేం?"

"నీ కిష్టం లేకపోతే పిలువకమ్మా! 'అమ్మా' అని పిలువకపోయినా పెరుగే స్తాగా! నీకు కాకుండా నేనింకెవరికి పెట్టుకుంటాను చెప్పు"

"మా అమ్మను చూడాలి. మా అమ్మదగ్గిర పడుకోవాలి. మా అమ్మ నన్ను ముద్దు పెట్టుకోవాలి. నా కన్నం పెట్టాలి. మా అమ్మ నాకు నీళ్ళు పొయ్యాలి. మా అమ్మను రమ్మను, లేకపోతే నేను బడికిపోను. అన్నం తినను. నీళ్ళు పోసుకోను. ఏమీ చెయ్యను."

"మీ అమ్మ, పాపం, ఇక్కడికి వచ్చికూచోమంటే కూచోగలదా? నువ్వే వెళుదువుగాని."

"అన్నీ వొట్టిదే! నువు పంపిస్తావా నిజంగా?"

"పంపించకపోతే అప్పుడను."

"చూద్దాంగా?"

* * * *

తన తల్లి కనపడగానే ప్రసాదం తల్లికేసి చేతులుచాచి "నేనొచ్చానే అమ్మా!" అన్నాడు. తల్లి పెద్ద కేకవేసి కొడుకుని ఆలింగనంచేసి, మొహమంతా నిమిరి, "ఒచ్చావుట్రా, నాన్నా? నా చిట్టితండ్రే! నా బంగారు తండ్రే మా నాయనే! మా వర హాలే!" అని ప్రేమ కురిపించసాగింది.

"నన్ను పంపించకపోతే అన్నం తిన్నన్నానే! బడికి పోనన్నానే? నీళ్ళు పోసుకోనన్నా!"

తల్లి ముక్కుమీద వేలు పెట్టుకొని గుడ్లు తేలవేసి కొడుక్కేసి చూస్తూ "అయ్యయ్యో! అట్లా అనొచ్చునట్రా, పిచ్చి వెధవా!" అన్నది.

"ఏమే" అన్నాడు ప్రసాదం. నిర్లక్ష్యంగా తలాడిస్తూ.

"ఆవిడ ఏమన్నా అనుకోదూ?"

"ఏ మనుకుంటే?" ఇంకా నిర్లక్ష్యంగా.

"ఆవిడ కోపం రాదుట్రా? పైకట్లా అనొచ్చా?"

"ఆ వెధవముండ కోపంవస్తే నాకు భయమూ ఏమిటి?" అన్నాడు ప్రసాదం తన తల్లి బెదురు కాశ్చర్యపడుతూ.

తన కొడుకు ప్రయోజకత్వానికి కలిగిన ఆనందాన్ని లోపలే అణుచుకోటానికి ఆడది చెయ్యగలిగినంత ప్రయత్నంచేస్తూ, నోటిమీద చెయ్యి కొట్టుకొంటూ "అవ్వ! అవ్వ! అట్లా అనొచ్చుట్రా? ఆవిడకు తెలిస్తే ఏమంటుంది?" అన్నది.

"ఏమంటుందేం? నేను రోజూ ఆవిణ్ని అంటంలా?"

"ఏమనీ?"

"వెధవముండా అని."

తల్లి కొడుకువంక సోద్వేగంగా చూస్తూ "ఆ మాటంటే ఊరుకుంటుందీ?" అన్నది.

"ఎందుకూరుకోదూ?"

నువ్వట్లా అన్నా, నిన్ను ఆపేక్షగా చూస్తుందిట్రా?" అన్నది తల్లి.

"పెరుగేసి పెడుతుంది."

* * * *

రాత్రివేళ భోంచేసి ప్రసాదం పడుకున్నాడు. ఇక్కడి మంచాలూ పక్కలూ అక్కడంత బాగాలేవు. లేకపోతే ఏం? ఇది అమ్మవేసిన పక్క. ఇవాళ మళ్ళీ ఒక రాత్రివేళ అమ్మవచ్చి తన పక్కలో పడుకుని అదివరకల్లేనే ముద్దు పెట్టుకుంటుంది. కాని ఏడవదు. ఇంకెందుకేడవడం? తన పెంపుడయి పోయిందిగా!.... అమ్మవచ్చి తనదగ్గిర పడుకునేదాకా తను మేలుకునే ఉండాలి.... తనువచ్చిన సంతోషం పొద్దున అమ్మ ఎంత బాగా కనపరిచింది. మళ్ళా రోజుల్లా కనబరచలేదు కాని లోపల, ఉంటుంది!

అమ్మా, నాన్నా జాము సేపటినించి మాట్లాడుకుంటున్నారు. తనకేమీ అర్థం కాదు. వాళ్ళు మాట్లాడేది తన్నుగురించే.

"ఆవిడకి వాడంటే చాలా ఆపేక్షగా ఉన్నట్టుంది. అదీ కొంత నయమే! వాణ్ణి మనిష్టం వచ్చినప్పుడల్లా తెచ్చుకోవచ్చు....ఆవిణ్ని కొంత డబ్బేమన్నా అడుగుతారా ఏమిటి?" అంటున్నది అమ్మ.

"ఏదో చూద్దాంలే" అని విసుక్కుంటున్నాడు నాన్న.

* * * *

నెలరోజులయినా సుబ్బమ్మ కుర్రవాడికోసం కబురు చేయదు పది రోజుల నించీ ప్రసాదం తల్లిదండ్రుల ఆదుర్దా హెచ్చుతున్నది.

ఆవిడ పిల్లాణ్ని విడిచిపెట్టేసి, ఇంకోణ్ని పెంచుకుంటుందేమో!

వీడు ఆవిడకేం కోపం తెప్పించాడో ఏం ఖర్మమో!

కాకపోయినా, ఆవిడమీద ఈ వెధవ కింత అలుసెట్లా వచ్చిందో! ఎవర్ని

తొందరపడి ఏ మాటా అనేవాడు కాదే!....

చాటుగా అమ్మ అబ్బాయిని కసిరింది– "నువ్వావిణ్ణి ఏమన్నావురా వెధవా?"

"వెధవముండా అన్నాను."

"ఎన్నిసార్లన్నావు?"

"ఏమీ! చాలాసార్లన్నాను. ప్రతిరోజూ అన్నాను. ఆవిడ వెధవముండ కాదా ఏమిటి? ఆవిడ దగ్గిర వెధవముండ వాసన కూడానూ!"

తనని గద్దించే తల్లినీ, ఆదివరకు ఆనాడు తనని దొడ్లోకి తీసుకువచ్చి ఏడ్చిన తల్లినీ ఒకలెగా భావించలేక పోయినాడు ప్రసాదం. ఆడదాని అఘాయిత్యం వాడికేం తెలుసు! ఆనాడు తనని ఏడిపించడమే ఆవిడ ఆశయం అని వాడే మెరుగునూ?

*    *    *    *

"మావాడు వట్టి వదరుబోతు. వాడు అందర్నీ తిట్టటం కూడా నేర్చుకున్నాడు." అన్నాడు అబ్బాయి జనకతండ్రి.

"అందర్నీ ఎందుకు తిడతాడు పాపం? నన్నే తిడతాడు. వాడిచేత తిట్టించుకోవటం నాకు ముద్దే! నేను వాడి కా అలుసిచ్చాను." అన్నది సుబ్బమ్మగారు.

జనకతండ్రి అతిదీర్ఘ నిశ్వాసం విడిచాడు. అంత గాలీ ఆయనలో ఉండి రకరకాల హృదయ మనోవికారాలు కలిగిస్తూ ఉండింది. ఆ విషవాయువు బయటికి పోగానే ఆయన మొహంలో కొత్త కళ వచ్చింది.

"వాడు తల్లికోసం, పాపం కలవరించసాగాడు. అందుకని పంపించాను. వాడి సుఖమే నాక్కావలిసింది" అన్నది సుబ్బమ్మకూడా నిట్టూర్చి.

"బాగుందే! ఇక మీరే వాడి తల్లి! మీరు వాణ్ణి కాస్త భయపెట్టండి, లేకపోతే చెడతాడు!"

*    *    *    *

"ప్రసాదం?"

"ఏవమ్మా?"

"పడుకోవ్రటా, నాయనా?"

"పడుకుంటాన్లేవే."

"నా పిచ్చి తండ్రిగడే. నన్నేవే అన్నావుటే! ఏదీ ఒక ముద్దు పెట్టు! ఆరి దొంగముండా, నీ ముద్దెంత కమ్మగా ఉందిరా!.... నా దగ్గిర వెధవముండ వాసనెయ్యటం లేదమ్మా!

ప్రసాదం బిక్కమొహం వేశాడు.

"నా తండ్రి లేదులేరా!" అని సుబ్బమ్మ కుర్రాణ్ణి తన రొమ్మున అదుముకున్నది.

ముద్రణ : భారతి, ఆగస్టు 1938